రైతులకు ఇబ్బందులు రావొద్దు

- ధాన్యం తడిస్తే అన్నదాతలకు నష్టం జరగకుంగా మిల్లులకు చేరవేయాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- సంబంధిత అధికారులతో సమీక్ష

వికారాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మే 28 : వరి ధాన్యం తడిస్తే రైతులకు నష్టం వాటిల్లకుండా రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వరి ధాన్యం సేకరణ, మిల్లర్లకు చేర వేయడం, రవాణా సదుపాయం తదితర అంశాలపై బుధవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రుతుపవనాలు ముందుగానే రావడంతో వర్షాలు కురుస్తున్నాయని, దీంతో ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రైతులకు నష్టం రాకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం అదనంగా లారీలు, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు చేరవేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీసీఎంఎస్ రాము, రవాణా శాఖ జిల్లా అధికారి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లకు చేరవేయాలి

ధారూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు చేరవేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ధారూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ గిడ్డంగి ఆవరణలో ఆరబోసిన వరి ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వరి ధాన్యం తడిస్తే రైతులకు నష్టం వాటిల్లకుండా రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రైతులకు నష్టం వాటిల్లకుండా వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు అదనంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఉన్నారు.

అర్హులందరికీ ఇండ్లు మంజూరు

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- సంబంధిత అధికారులతో సమీక్ష

జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

ఆదిబట్ల, మే 28: అర్హులందరికీ ఇండ్లు మంజూరయ్యాయని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 16,617 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూయ్యాయని ఇంకా 839 మందికి మంజూరు ఇవ్వాల్సి ఉందన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ వికాసం పథకాల అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంజూరైన లబ్ధిదారుల ఇండ్ల గ్రౌండింగ్ వెంటనే చేపట్టాలన్నారు. మిగతా వాటిని మండల, మున్సిపల్ పరిధిలో అధికారులు చొరవ చూపి వారం లోపు అన్ని గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పక్కాగా అమలు చేయాలని, మండల స్థాయిలో మేస్త్రి చార్జీలు, క్రషర్ టోన్, ఇసుక, ఇటుక ధరల నిర్ణయానికి నియంత్రణ కమిటీ వేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రాజీవ్ వికాసం పథకంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ లాగిన్‌లోకి పంపించాలని, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున మంజూరు పత్రాలు యువతకు అందజేస్తామన్నారు. జూన్‌లో ఇచ్చే రూ. 50వేలు, రూ.లక్ష లోపు, లబ్ధిదారులను అధికంగా ఎంపిక చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బ్యాంకర్స్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో వనమహోత్సవం

వన మహోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వన మహోత్సవం ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డీఆర్‌డీఏ 41,72,710 మొక్కలు, విద్యా శాఖ 89,428, అటవీ శాఖ 9,53,757 లక్షలు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ పరిధిలో విరివిగా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. నేషనల్ హైవే, రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్ రోడ్లకు ఇరువైపులా ఎక్కువగా మొక్కలు నాటలన్నారు. ప్రతి శాఖ తమ పరిధిలో 3 రోజుల్లో మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు ఎక్కువగా నాటాలన్నారు. ఎక్సైజ్ శాఖ వారు ఈత వనాలను సొసైటీల ద్వారా వారికి ఇచ్చిన స్థలాల్లో పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేశ్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

- ఇర్విన్ రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండ్
- కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- మండల కేంద్రంలో రాస్తారోకో
- పలు పార్టీల నాయకుల సంఘీభావం


మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

మాడ్గుల, మే 28 : మండల పరిధిలోని రైతులు రోడ్డెక్కారు. ఇర్విన్ రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాకు ఈ రిజర్వాయర్ వద్దంటూ ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మాల్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బీఆర్ఎస్ పార్టీ, సీపీఎం, బీజేపీ నాయకులు రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూమికి భూమి ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణానికి 1400 ఎకరాల భూమిని 938 మంది రైతులు కోల్పోతున్నారన్నారు. ఎకరాకు రూ.8 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తే నష్టం జరుగుతుందన్నారు. రూ.8 లక్షలు పెడితే ఒక కుంట భూమి కూడా రాదన్నారు. వ్యవసాయం చేసే భూముల్లో రిజర్వాయర్ నిర్మిస్తే మా బతుకులు బజారు పాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ రిజర్వాయర్ ద్వారా నల్లగొండకు జిల్లాకు నీరు తరలిస్తే ఇక్కడి రైతులు పూర్తిగా నష్టపోతారని వాపోయారు. ఎకరాకు రూ.50 లక్షలు చెల్లించి రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రాణాలైనా అర్పిస్తాం కానీ భూములు మాత్రం ఇవ్వమని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి రిజర్వాయర్ పనులను నిలిపివేయాలని కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికల సమయంలో ఉన్న ధరకు మూడింతలు ఎక్కువ ఇప్పిస్తానని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. రైతులకు తెలియకుండానే రైతుల ఖాతాలో డబ్బులు ఎలా పడుతున్నాయని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జార్జి రెడ్డి, జంగయ్య, అల్లాజి యాదవ్, భూపేశ్ చారి, అశోక్, వెంకటయ్య గౌడ్, బుచ్చయ్య, సీపీఎం నాయకులు పగడాల యాదయ్య, అంజయ్య, జగన్, రమేశ్, బీజేపీ నాయకుడు పెద్దయ్య యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు, మహిళలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్, యువజన, క్రీడల జిల్లా ఇన్‌చార్జి అధికారి హర్షాచౌదరి

వికారాబాద్, మే 28 : రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలోని వివిధ క్రీడా అకాడమీ, వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్, యువజన, క్రీడల జిల్లా ఇన్‌చార్జి అధికారి హర్షాచౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ప్రవేశానికి అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, హ్యాండ్ బాల్, వాలీబాల్‌లో బాలురు, బాలికల ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లాలో అర్హులైన/ఆసక్తి ఉన్న బాలురు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న స్కూల్/కాలేజీ బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడా ధృవీకరణ పత్రాలు, 10 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఒరిజినల్, జిరాక్స్ లతో ఉదయం 7 గంటలకు ఎంపిక ప్రదేశాలకు హాజరు కావాలన్నారు. వాలీబాల్‌కు సంబంధించి జూన్ 1న సిద్దిపేట జిల్లాలోని వాలీబాల్ అకాడమీ, 10న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, రాజన్న సిరిసిల్ల మినీ స్టేడియం, వాలీబాల్ అకాడమీలో, 12, 13 తేదీల్లో మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియం గ్రౌండ్‌లో ఎంపికలు జరుగుతాయని ఆయన తెలిపారు. 10, 11 తేదీల్లో సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ వెలోడ్రోమ్, ఓయూ క్యాంపస్, హైదరాబాద్, ప్రాంతీయ క్రీడా వసతి గృహం, హనుమకొండ, 10, 11 తేదీల్లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ హ్యాండ్ బాల్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ, హన్మకొండలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న హాకీ అకాడమీ, వనపర్తిలోని డాక్టర్ బాల కృష్ణయ్య మిని స్టేడియం, అలాగే ఖమ్మంలోని జిల్లా క్రీడా ప్రాదిక సంస్థలో 12న అథ్లెటిక్స్ ఎంపికలు జరుగుతాయన్నారు. 10 నుంచి 12 ఏండ్ల వారికి జిమ్నాస్టిక్స్, సిమ్మింగ్ ఎంపిక, 12 నుంచి 16 ఏండ్ల వారికి అథ్లెటిక్స్, సైక్లింగ్, హ్యాండ్ బాల్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్ లలో ఎంపికలు ఉంటాయని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మంచాల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

మంచాల, మే 28 : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. బుధవారం మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధికి బాటలు వేయనున్నట్టు తెలిపారు. మంచాల పాఠశాలను భారతీయ విద్యా భవన్ పాఠశాలలా తీర్చిదిద్దుతామన్నారు. జూన్ 6న పాఠశాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు. సామాజిక కార్యకర్తలు, యువజన సంఘాల సభ్యులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.ఈ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు పద్మజ. మండల విద్యాధికారి రాందాస్. ప్రధానోపాధ్యాయులు తుల్జారాం. ఝాన్సీ, రూబియా, సీఆర్పీలు జగదీశ్, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను నిరోధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 28 : పశువుల అక్రమ రవాణాను నిరోధించాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లాలోని పోలీసు అధికారులు, పశుసంవర్ధక శాఖ ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జూన్ 7న జరిగే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పశువుల అక్రమ రవాణాను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా వ్యూహాత్మకంగా మొత్తం 8 ప్రత్యేక తనిఖీ కేంద్రాలు (చెక్ పోస్టులు) ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్ పోస్టుల వద్ద 24 గంటలూ పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తూ ఉంటారని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తారన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా పశువులను రవాణా చేయడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువుల క్రయ విక్రయాలు జరిపే రైతులు, వ్యాపారులు సంబంధిత గ్రామ పంచాయతీ లేదా మునిసిపల్ అధికారులతో ధృవీకరించిన రశీదులను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని పక్షంలో, అది అక్రమ రవాణాగా పరిగణించి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం జిల్లా పశు వైద్యాధికారి సదానందం మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్య సంరక్షణ, వాటి గుర్తింపునకు సంబంధించిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో వికారాబాద్, తాండూరు, పరిగి డివిజన్ల డీఎస్పీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, మే 28 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలు జూన్ 3 నుంచి 13వరకు ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాలో 20 పరీక్షా కేంద్రాల్లో 5,308 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పరిగిలో మూడు కేంద్రాలు, తాండూరులో ఏడు, కొడంగల్‌లో ఒకటి, వికారాబాద్‌లో ఐదు, మోమిన్‌పేటలో రెండు, కులకచర్లలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని తెలిపారు. అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. అలాగే ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదన్నారు. సమావేశంలో డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెండర్లకే పరిమితం!

కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రాజెక్టులన్నీ కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. అట్టహాసంగా మీరాలం చెరువు మీద కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తే... ఇప్పటికీ ఆ ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయలేదు. ఆరు నెలల కిందట అధ్యయనం చేస్తామంటూ ట్రాన్సాక్షనల్ అడ్వైజరీకి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేయగా... ఇప్పటికీ అతీగతి లేకుండా పోయింది. కనీసం ఆ ఏజెన్సీ ఇప్పటికీ ఏం చేసిందనేది కూడా తెలియడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించుకున్న కీలకమైన ప్రాజెక్టుల విషయంలోనూ ఈ తరహా జాప్యం జరిగితే... ఇక పెండింగ్‌లో ఉన్న పనుల పరిస్థితి ఏంటని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

- ప్రశ్నార్థకంగా మీరాలం కేబుల్ బ్రిడ్జి నిర్మాణం
- సాక్షాత్తు సీఎం ప్రకటించినా తట్టెడు మట్టి ఎత్తిపోయని వైనం
- ఏజెన్సీకి పనులు అప్పగించకుండానే ఆగిన ప్రాజెక్టు
- సమీక్షా సమావేశాల్లో హెచ్ఎండీఏకు ఆహ్వానం లేకపోవడంతో గందరగోళం

మీరాలం చెరువు కేబుల్ బ్రిడ్జ్ ఊహా చిత్రం

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): మీరాలం చెరువును పర్యాటక ప్రాంతంగా, బెంగుళూరు హైవేకు రవాణా సదుపాయాలను మెరుగుపరిచేలా ఆధునీకరించాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మీరాలం బ్యూటిఫికేషన్‌పై అప్పట్లోనే కార్యాచరణ రూపొందించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అంచనా, ప్రాజెక్టు విధివిధానాలు, డీపీఆర్ రూపకల్పనపై హెచ్ఎండీఏ కసరత్తు చేసి ప్రభుత్వానికి అందజేసింది. అయితే తదనంతరం అధికారంలోకి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మీరాలం చెరువుపై నిర్మించే కేబుల్ బ్రిడ్జి నిర్మాణాన్ని గందరగోళంలో పడేసింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరకు పైగా గడుస్తున్నా కనీసం ఇప్పటికీ డీపీఆర్ కూడా ఖరారు కాలేదు.

హెచ్ఎండీఏ ప్రమేయం లేకుండానే..

వాస్తవానికి మీరాలం చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన నమూనాలను తీర్చిదిద్దేందుకు ఓ కన్సల్టెన్సీని హెచ్ఎండీఏ నియమించింది. ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి, పబ్లిక్-ప్రైవేట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్రమైన విధివిధానాలను రూపొందించే పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఖర్చు, ట్రాఫిక్ రద్దీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏజెన్సీకి డీపీఆర్ సిద్ధం చేసే బాధ్యతలను అప్పగించేలా టెండర్లను పిలిచింది. కానీ ఆ తర్వాత జరిగిన సమీక్ష సమావేశాలనుహెచ్ఎండీఏ ప్రమేయం లేకుండా నిర్వహించడంతో అసలు గందరగోళం మొదలైంది. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి.. హెచ్ఎండీఏ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు లేకుండా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అదే మీటింగ్‌లో ఎంఆర్‌డీసీఎల్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొనడంతో అసలు గందరగోళానికి కారణమైంది.

ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే..

బెంగుళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. బెంగుళూరు హైవే నుంచి చింతల్‌మెంట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ, రవాణా దూరం తగ్గిపోవడంతోపాటు మీరాలం చెరువు పర్యాటక ప్రాంతంగా మారనుంది. దీనికి వీలుగా ప్రాజెక్టు డిజైన్ ఉండాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిపై వ్యూ డెక్, స్కై వాక్‌తోపాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు. మీరాలం ట్యాంక్ ఆధునీకరణలో భాగంగా సైకిల్ ట్రాక్, పెడిస్ట్రీయన్ ట్రాక్ కూడా అందుబాటులోకి రానుంది. మీరాలం వెంబడి పర్యాటక రంగానికి మరింత అవకాశం ఏర్పడుతుందని జూ పార్క్ సందర్శనకు వచ్చేవారికి అనువుగా ప్రాజెక్టు ఉండాలని ప్రణాళికలను గతంలోనే అధికారులు సిద్ధం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న కాంగ్రెస్ పాలనలో మీరాలం ప్రాజెక్ట్ జాప్యం కారణంగా దాని మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా పరిధిలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన పిల్లలతో పాటు క్రీడలు, కళలు, సంస్కృతి, సామాజిక రంగాలలో గుర్తింపు పొందిన బాలబాలికలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందజేయడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం పిల్లలు జాతీయ అవార్డు www.awards.gov.in వెబ్‌సైట్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అచ్యుత సమంతకు డాక్టరేట్

సిటీబ్యూరో, మే 28(నమస్తే తెలంగాణ): ప్రముఖ సామాజికవేత్త, విద్యావేత్త, కిట్ అండ్ కిస్ సంస్థ వ్యవస్థాపకులు డా.అచ్యుత సమంతకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని హిమాలయన్ యూనివర్సిటీ బుధవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర మంత్రి పసంగ్ డోర్జి సోనా, యూనివర్సిటీ చైర్మన్ హేమంత్ గోయల్, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.ప్రకాశ్ దివాకరన్ చేతుల మీదుగా అచ్యుత సమంత ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు.

సిటీకి సుంకిశాలే శరణ్యం

(మొదటి పేజీ తరువాయి..)

మోటార్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం పరిపాటిగా మారుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని రెండు, మూడు సంవత్సరాల పాటు సాగర్‌లో నీటిమట్టం తక్కువైనా డెడ్‌స్టోరేజీ నుంచి నగరానికి కృష్ణాజలాల్ని తరలించేందుకు కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల పథకాన్ని చేపట్టింది. అందులో 80 శాతం వరకు పనులు కూడా పూర్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గత ఏడాది ఆగస్టులో రిటైనింగ్ వాల్ కూలిన ఘటన చోటుచేసుకుంది. దీంతో ఈ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అనేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించింది. ఎస్ఎల్‌బీసీ ద్వారా గ్రావిటీ మీద కృష్ణాజలాలు వస్తాయని, తద్వారా సుంకిశాల అవసరం లేదని భావించింది. కానీ సొరంగం కుప్పకూలిన సంఘటనతో ఎస్ఎల్‌బీసీ భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. దీంతో మాధవరెడ్డి ప్రాజెక్టులో ఐదో మోటారు ద్వారా సుంకిశాల ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం యోచించింది. సుమారు రూ.150-200 కోట్ల వ్యయాన్ని జలమండలి భరిస్తే ఐదో మోటారు ఏర్పాటు చేయవచ్చని నీటిపారుదల శాఖ పలు ప్రతిపాదనల్ని కూడా ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. కానీ జలమండలి అందుకు ససేమిరా అన్నట్లు సమాచారం. శాశ్వత పరిష్కారంగా సుంకిశాల పథకమే మేలని భావించి... ఆ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించుకుంది. దీంతో కేసీఆర్ పథకమే నగర నీటి సరఫరాకు శ్రీరామరక్షగా మారనున్నది.

తెరపైకి ఫోర్‌షోర్‌లో గేట్ల ఏర్పాటు..

సుంకిశాల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఇప్పటికే రెండు పర్యాయాలు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. రెండు రోజుల కిందట ఇంజినీరింగ్ నిపుణులు కన్నయ్య నాయుడిని తీసుకువెళ్లారు. ఉమ్మడి రాష్